

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 04-09-2022 సంపుటి : 04 సంచిక : 16 పేజీలు : 4 వెల : రూ 3-00

## వైఎస్సార్ జిల్లాలో ముగిసిన సీఎం జగన్ పర్యటన



కడప: వైఎస్సార్ జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ముగిసింది. శనివారం ఉదయం ఇడుపులపాయ నుంచి తాడేపల్లి నివాసానికి చేరుకున్నారు. మూడు రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో మొదటిరోజు గురువారం.. పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పులలో నిర్మించిన మోడల్ సచివాలయ భవన ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి సందర్శించి ప్రారంభించారు. సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, రైతు భరోసా కేంద్రంతో పాటు అన్ని కార్యాలయాలలో కలియదిరిగారు. గ్రామ సచివాలయంలో సీఎం జగన్ అరగంటకు పైగా గడిపారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తానున్నానంటూ భరోసా ఇచ్చారు. రెండోరోజు..

దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన నివాళులర్పించారు. సీఎంతో పాటు ఆయన కుటుంబసభ్యులు వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, వైఎస్ షర్మిల వైఎస్సార్‌కు నివాళు లర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. విడతల వారీగా సాయంత్రం వరకు పులివెందుల నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాల పై స్థానిక నాయకులు, అధికారులతో సీఎం సమీక్ష జరిపారు.

## శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో రెండో దశలో 111 ఆలయాల నిర్మాణం : టీటీడీ ఈఓ ధర్మారెడ్డి



తిరుపతి : రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 111 ఆలయాల నిర్మాణం చేపట్టాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. సనాతన ధర్మ వ్యాప్తిలో భాగంగా మత మార్పిడులను అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ సహకారంతో రెండో దశలో ఈ 111 ఆలయాలను నిర్మించనున్నారు. తిరుపతిలోని పరిపాలన భవనంలో శ్రీవాణి ట్రస్టుపై అధికారులతో ఈఓ ధర్మారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు నిధులతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,342 ఆలయాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. మొదటి దశలో 502 ఆలయాల నిర్మాణం పూర్తికాగా.. రెండో దశలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో రూ.10 లక్షల వ్యయంతో 111 ఆలయాల నిర్మాణం జరుగనున్నదని చెప్పారు. వీటిలో శ్రీవారి ఆలయాలు -9, రామాలయాలు-77, హనుమంతుడి ఆలయాలు-2, శివాలయాలు? 3, గ్రామదేవతల ఆలయాలు? 20 ఉన్నాయని వెల్లడించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆలయాల నిర్మాణంపై సమీక్ష జరుపనున్నట్లు చెప్పారు.నిర్మాణం పూర్తయిన 502 ఆలయాలు, నిర్మాణం జరుగనున్న 111 ఆలయాలకు భజన సామగ్రి అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని హిందూ ధర్మప్రచార పరిషత్ అధికారులను ఏవీ ధర్మారెడ్డి ఆదేశించారు. ఈ ఆలయాల్లో అర్చకులుగా నియమించే వారికి శ్వేత ఆధ్వర్యంలో నిత్యపూజా విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో టీటీడీ జేఈఓలు శ్రీమతి సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ ఓ బాలాజి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సమరసత సేవా ఫౌండేషన్ ఛైర్మన్ తాళ్లూరు విష్ణు, సెక్రటరీ త్రినాథ్, జాయింట్ సెక్రటరీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు భద్రతపట్ల చిత్తశుద్ధి

### మంత్రి అంబటి రాంబాబు

అమరావతి గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు కూరుకుపోవడం వల్ల 700 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తుంది. నీటి ప్రవాహం అధికం ఉండటం వల్ల రెండు రోజుల నుండి స్టాప్ లాక్ ఏర్పాటు చేయలేక పోయామని మంత్రి అంబటి రాంబాబు అన్ఆరు. కొన్ని గేట్లు బాగాలేదని ఇప్పటికే నివేదిక ఇవ్వటంతో రిపేర్ల కోసం అనుమతి ఇచ్చాం. గేట్లు బాగుచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. అవసరమైతే నాగార్జున సాగర్ నీటితో రిజర్వాయర్ నింపుతాం. కొందరు కావాలని అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారు. ఐదారేళ్ళ నుండి తుప్పు పట్టడం వల్లే ఘటన జరిగింది. రెండు గేట్లు బాగలేకపోవటంతో ఇప్పటికే స్టాప్ లాక్స్ ఏర్పాటు చేశాం. గత ప్రభుత్వం డ్యాం సేఫ్టీ కోసం రూపాయి ఖర్చు చేయలేదు. రాజకీయంగా ఈ విషయాన్ని వాడుకోవాలని చూడటం సరైనది కాదు. చంద్రబాబు విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఏ పరిశ్రమ ఏపీకి రాకూడదని చంద్రబాబు పూజలు చేస్తున్నారు. ఏపీకి బల్క్ డ్రగ్ పార్క్ వల్ల పర్యావరణ కాలుష్యము ఏర్పడుతుంది.. ప్రాజెక్ట్ వద్దని యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. ఆరు కోట్ల రూపాయలు డబ్బు టీడీపీ డ్యాం కోసం ఖర్చు పెట్టలేక పోయింది. గత ప్రభుత్వం డ్యాంలను అశ్రద్ధ చేయటం వల్లే ఈ పరిస్థితి అని విమర్శించారు.ఇప్పుడు గుండ్లకమ్మలో ఉన్న 3.4 టీయంసీ నీటిలో 2 టీయంసీలు సముద్రంలో విడుదల చేయక తప్పదు. పులిచింతలలో కూరుకుపోయిన గేట్లు రిపేర్ చేస్తున్నాం. రాష్ట్రంలో అన్నీ ప్రాజెక్టులలో గేట్లు రిపేర్లలో ఉన్న మాట వాస్తవం. ఇవన్నీ సీఎం జగన్ ప్రమాణ స్వీకారం తర్వాత ఏమి జరగలేదు. సీఎం జగన్ పై అనవసర ఆరోపణలు చేసి లబ్ది పొందాలని చూస్తే ఉపయోగం లేదు. అన్నీ డ్యాంల సేఫ్టీ పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు.



## అసెంబ్లీకి మూడు రాజధానుల బిల్లు...?



విజయవాడ, సెప్టెంబర్ 3, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉపసంహరించుకున్న మూడు రాజధానుల బిల్లును మళ్ళీ తెస్తుందా? ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ మానస పుత్రికకు మళ్ళీ ప్రాణం పోయాలని అనుకుంటున్నారా? అంటే, అధికార వైసీపీ వర్గాల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. నవంబర్ లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకుంది.సమబందించి దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఈ మేరకు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి పాత బిల్లును ఉపసంహరించుకుంటూ తెచ్చిన కొత్త బిల్లును సభ ఆమోదం తెలిపింది. అయితే, అప్పుడే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ప్రభుత్వం వికేంద్రీకరణకు కట్టుబడి ఉందని, సాంకేతికంగా బిల్లును వెనక్కి తీసుకున్నా, మూడు రాజధానులకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అంతే కాదు, ఉపసంహరించుకున్న బిల్లు స్థానంలో మరింత పక్కా బిల్లును త్వరలోనే తీసుకొస్తామని ప్రకటించారు.ఇదంతా చరిత్ర, అయితే ఇప్పుడు, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఈ నెల మూడవ వారంలో మొదలయ్యే, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లును మళ్ళీ ప్రవేశ పెట్టె ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి ఇంతవరకు అధికారికంగా అసెంబ్లీ సమావేశాల తేదీలు ఖరారు కాలేదు. కానీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు, ఈ నెల మూడవ వారంలో వారం రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ నెల 7న జరిగే కేబినెట్ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల తేదీల పై తుది నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. అలాగే,ఈ సారి అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలకమైన బిల్లులతో పాటుగా, మరోసారి మూడు రాజధానుల బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టుగా ప్రచారం అయితే జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మూడు రాజధానుల అంశాన్ని మొదటి సారిగా 2019 డిసెంబర్ 17న సీఎం వైఎస్ జగన్ అసెంబ్లీలో ప్రకటించారు. శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వాహక రాజధానిగా కర్నూలును నిర్ణయించినట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలిలో ప్రవేశపెట్టారు. అక్కడ ఆమోదం పొందకపోవడంతో గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకొచ్చి పాలనా వికేంద్రీకరణ, సీఆర్డీఏను రద్దు చేస్తూ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. దీనిపై రాజధాని రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆందోళన చేపట్టారు ఈ రోజుకు కూడా అమరావతి రైతుల ఆందోళన కొనసాగుతూనే వుంది. ఎండా వానలు, ప్రకృతి వైపరీత్యాలతో పాటుగా కొవిడ్ మహమ్మారిని కూడా తట్టుకుని అమరావతి రైతులు, మహిళలు విభిన్న రూపాల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పేరున అమరావతి రైతులు చారిత్రక పాదయాత్ర నిర్వహించారు.


## విపక్షాలు ఏకమైతే విలక్షణ తీర్పు : నితీష్ కుమార్

పట్నా : మణిపూర్‌లో ఐదుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంపై బిహార్ సీఎం నితీష్ కుమార్ స్పందించారు. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చీల్చి బీజేపీ తమలో కలుపుకుంటోందని ఆరోపించారు. కాషాయ పార్టీ నిర్వాకం రాజ్యాంగబద్ధమైనదేనా అని నితీష్ ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.2024 లోక్‌సభ ఎన్నికల్లో విపక్షం ఏకతాటిపైకి వస్తే దేశంలో విభిన్న ఫలితాలు వస్తాయని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ఎమ్మెల్యేలు పార్టీలు మారడాన్ని ప్రస్తావిస్తూ బిహార్‌లో తాను ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చి మహాకూటమి సర్కార్‌ను ఏర్పాటు చేసే క్రమంలో ఆరుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేలు తమను కలిసి పార్టీతోనే కలిసి ప్రయాణిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.కాగా మణిపూర్‌లో ఆరుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేల్లో ఐదుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం బీజేపీలో చేరడంతో నితీష్ కుమార్ సారధ్యంలోని జేడీ(యూ)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇక ఆగస్ట్ 25న అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన జేడీ(యూ) ఏకైక ఎమ్మెల్యే టెకి కసో బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో కాషాయ పార్టీలో చేరారు.

## దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ భేటీ..

### హాజరైన ఏపీ మంత్రులు బుగ్గన, పెద్దిరెడ్డి

తిరువనంతపురం: దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ కేరళ రాజధాని తిరువనంతపురంలో శనివారం సమావేశమైంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో వివిధ రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా ఉన్న వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విభజన సమస్యలను మంత్రులు ప్రస్తావించారు. అలాగే తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ లోటు గ్రాంట్, 7 జిల్లాల ప్యాకేజీ నిధులు, రామాయపట్నం పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు గురించి సైతం ప్రస్తావించారు.మరోవైపు ఈ సమావేశానికి తెలంగాణ తరపున హోంమంత్రి మహమూద్ ఆలీ, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీరు ఏపీ, తెలంగాణ మధ్య విద్యుత్ బకాయిలు, విభజన సమస్యలు, కృష్ణా జలాల పంపిణీ, నీటిపారుదలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.



## ఏపీలో పోలీసుల తీరు మారకుంటే రోడ్డెక్కుతా : పవన్ కల్యాణ్



అమరావతి: జనసేన పార్టీపై కొందరు నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. జనసేన ఉనికిని తీసిపారేయడం ఎవరి తరం కాదని, ప్రజలే పార్టీని కాపాడు కుంటారని ఆయన అన్నారు. జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. పోలీసుల తీరు మారకుంటే రోడ్డుక్కుతానని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదనే సంయమనం పాటిస్తున్నానని పేర్కొన్నారు.జనసేన జెండా దిమ్మలు పగులకొట్టిన వైసీపీ నేతలపై కేసులు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. జగ్గయ్యపేటలోనూ జనసేన పతాక ఆవిష్కరణ కోసం నిర్మించుకున్న జెండా దిమ్మెను వైసీపీ నేతలు జేసీబీతో కూల్చివేశారని మండిపడ్డారు. తమ నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని దుయ్యబట్టారు. అధికార పార్టీ అన్ని కార్యక్రమాలను ముందస్తు అనుమతితోనే చేస్తున్నారా అని ప్రశ్నించారు. పోలీసులు ధర్మాన్ని పాటించాలని సూచించారు.

## అన్న క్యాంటీన్లను నిర్వహించి తీరుతాం : లోకేశ్

అమరావతి : పేదల ఆకలిని తీర్చేందుకు నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని నిర్వహించి తీరుతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. ఇవాళ తెనాలి పట్టణంలోని మార్కెట్ సర్కిల్‌లో అన్న క్యాంటీన్లను



అడ్డుకున్న పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. అన్నం తినే వారెవ్వరూ అన్న క్యాంటీన్‌ను అడ్డుకోరని అన్నారు.నందిగామ, మంగళగిరి, కుప్పంలో అడ్డుపడ్డారని, ఇప్పుడు తెనాలిలోనూ అన్న క్యాంటీన్ నిర్వహించకుండా ఆపుతుండటంపై అసహనం వ్యక్తంచేశారు. రోజు మాదిరిగానే ఆహారం తీసుకువస్తున్న టీడీపీ వారి వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని వేరే చోటికి తరలించారు. వెంటనే అప్రమత్తమైన టీడీపీ కార్యకర్తలు వాహనంలో నుంచి కొంత ఆహారాన్ని తీసుకుని మున్సిపల్ మార్కెట్ వద్దకు చేరుకు ఆహార పంపిణీని చేపట్టారు. అక్కడకూ చేరుకున్న మున్సిపల్ అధికారులు ఆహార పంపిణీ అడ్డుకునే ప్రయత్నం చేయగా టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగారు.అదేసమయంలో వైసీపీ శ్రేణులు మున్సిపల్ మార్కెట్ వద్ద అన్నదానానికి యత్నించారు. ఐతే తమకు ఆంక్షలు విధించి వైసీపీ శ్రేణులను ఎలా అనుమతిస్తారని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. మార్కెట్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి.

# సంపాదకీయం

ఆదివారం 04-09-2022

## అవకాశాలలో సగం నినాదమేనా

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచాయి. ఘనంగా వజ్రోత్సవాలు కూడా జరిగాయి. మరి ఏడున్నర దశాబ్దాల స్వాతంత్య్రం తరువాత కూడా దేశంలో మహిళల పరిస్థితి ఎలా ఉంది?దేశ రాజకీయాలలో మహిళలు అస్తిత్వం నిలుపుకోవాలంటే ఎన్నో దశాబ్దాలు పోరాడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. వారిని ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారి అస్తిత్వం, హక్కులు, ప్రాణాలకు విలువ లేకుండా పోయింది. వారిని భాగస్వాములను చేయకుండా రాజకీయ ఎత్తుగడలు, సర్దుబాట్లు, సమీకరణాలతో సరిపుచ్చుతున్నారు. దీనికి ఏ రాజకీయ పార్టీ మినహాయింపు కాదు. నిర్ణయాధికారంలో మహిళలకు సమ భాగస్వామ్యం కల్పించాలని అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు చెబుతున్నా పాలకులకు పట్టింపు లేదు. 1996లో మహిళా రిజర్వేషన్ బిల్లును తొలిసారిగా పార్లమెంటులో ప్రవేశ పెట్టినప్పుడు మంచి రోజులు వచ్చాయని భావించారు. ఇది సువర్ణాక్షరాలతో లిఖించుకోవాల్సిన ఘట్టమని ఊదరగొట్టారు. ఇప్పటి వరకు ఆ బిల్లుకు ఆమోదం లభించలేదు. 'నిర్ణయాధికారంలో మహిళలకు సగ భాగస్వామ్యం' అన్న నినాదం కాగితాలకే పరిమితమవుతోంది. చట్టసభలలో సమాన బిల్లు కాదు కదా, మూడో వంతు రిజర్వేషన్ కల్పించే విషయంలోనూ ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదనేది స్పష్టమవుతోంది. పాతిక సంవత్సరాలు గడిచినా బిల్లు అమలుకు నోచుకోవడం లేదు. ఇది అర్ధ ప్రపంచపు హక్కు అయినా, దాని చుట్టూ పరిభ్రమిస్తున్న రాజకీయాలు మోసపూరితంగా, లింగ వివక్షతో కూడి ఉన్నాయి.నిబంధనల ప్రకారం ఏ బిల్లు అయినా పెండింగ్‌లో ఉంటే సభ రద్దు తర్వాత కాలం చెల్లిపోతుంది. మహిళా దినోత్సవం రోజే పార్లమెంటు సమావేశాలలో ఈ బిల్లు మరోసారి చర్చకు వచ్చింది. ఇప్పటికైనా దీనికి మోక్షం కల్పించాలని మహిళా ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదన 1975లో తొలిసారి లోక్‌సభలో ప్రస్తావనకు వచ్చింది. దీంతో కేంద్ర విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ కమిటీని నియమించింది. ఈ కమిటీ ముందుగా పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసింది. దీంతో 1993లో 73,74 అధికరణలను అనుసరించి చట్ట సవరణ చేసి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసేందుకు మూడో వంతు రిజర్వేషన్ కల్పించారు. 1996 సెప్టెంబర్ 12న అప్పటి ప్రధాని దేవెగౌడ ప్రభుత్వం తొలిసారిగా 'చట్టసభలలో మహిళా రిజర్వేషన్' బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ప్రభుత్వం మైనారిటిలో పడిపోవడంతో అది అటకెక్కింది. 1998లో రెండోసారి వాజ్‌పేయి సర్కార్ బిల్లును ప్రవేశపెట్టింది. లోక్‌సభ రద్దు కావడంతో బిల్లు మరోసారి మరుగున పడింది. 1999 డిసెంబర్ 23న దిగువసభలో ఈ బిల్లును ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సొంత నేతలతోపాటు కాంగ్రెస్ నేతలు అడ్డుపడటంతో వెనక్కి తగ్గింది. 2008లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం లోక్‌సభ ముగిసినా బిల్లు యాక్టివ్ గా ఉండేలా మార్పులు చేసింది. 2010 మార్చి ఎనిమిదిన రాజ్యసభలో ప్రవేశపెట్టింది. తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో మార్చి తొమ్మిదిన బిల్లు ఆమోదం పొందింది. కాంగ్రెస్ పార్టీలో గొడవలు రావడం, అసమ్మతి నేతలు వ్యతిరేకించడం, మొండిగా ముందుకుపోతే మధ్యంతర ఎన్నికలకు సిద్ధమవ్వాలని హెచ్చరించడంతో ఈ బిల్లు లోక్‌సభలో పెండింగ్‌లో ఉండిపోయింది.ఈ బిల్లు హామీతో ఐదుసార్లు అధికారంలోకి వచ్చిన యూపీఏ, ఎన్‌డీఏ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఇప్పటి ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఎన్నో చట్టాలను ఆమోదించారు. ఈ బిల్లుకు మాత్రం ఏకాభిప్రాయం కావాలనడం విడ్డూరం. కనీసం సీట్ల కేటాయింపులోనైనా మహిళా కోటాను అమలు చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ప్రపంచ దేశాల చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యం సగటున 22 శాతంగా ఉంది. మన దేశంలో 12 శాతం మాత్రమే. మనకంటే చిన్ని దేశాలైన రువాండాలో మహిళలకు 63.8 శాతం రిజర్వేషన్ ఉంది. స్కాండినేవియన్‌లో మహిళా ప్రాతినిధ్యం అధికంగా ఉంది. అల్జీరియా, దక్షిణ సూడాన్, లిబియా, సౌదీ అరేబియా వంటి దేశాలలో మహిళలకు గణనీయ ప్రాతినిధ్యం దక్కుతోంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా ఆలోచించి మహిళలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది

# ఆలీ, పోసానిలకు పోస్టు ఖాయం



విజయవాడ, సెప్టెంబర్ 3, కమెడియన్ అలీకి త్వరలో నామినేటెడ్ పోస్టు ఖాయం. ఎస్, వింటున్నది నిజమే, గిల్లుకుని గిచ్చుకుని చూసుకోవలసిన అవసరం లేదు. మీరు అనుకోవచ్చును, అబ్బో మూడేళ్ళుగా ఈ మాట వింటూనే ఉన్నాం గానీ ఇంకో మాటుంటే చెప్పమని మీరు అంటే అనవచ్చును,కానీ, బట్ షూర్.. అలీ ఇంటికి అల్లుడు వచ్చిన వేళా విశేషమో మరేమో కానీ,(ఈ మధ్యనే అలీ తమ కుమార్తె వివాహం చేశారు)ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయనకు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవి కాదంటే అందుకు సమానమైన మరో నామినేటెడ్ పదవి ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు వైసీపీ సర్కిల్స్ లో ఘట్టిగా వినిపిస్తోంది. నిజానికి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఫైల్ మీద పోస్ట్ రాసి, సంతకం పెట్టడం మాత్రమే మిగిలుందని, అంటున్నారు.అయితే ఒక్క ఆలీకేనా ఈ అదృష్టం అంటే, కాదుట, అలీకంటే ఎక్కువగా జగన్ రెడ్డిని భుజాన మోసే, పోసాని కృష్ణ మురళీకి కూడా నామినేటెడ్ పోస్టు ఖాయమని, అది కూడా అతి త్వరలోనే విడుదలవుతుందని అంటున్నారు. ఆలీకి వక్ఫ్ బోర్డు చైర్మన్ పోస్టు ఇస్తే, పోసానికి ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టు ఇవ్వచ్చని అంటున్నారు. నిజానికీ ,అలీ, పోసానీలతో పాటుగా మోహన్ బాబు ఫ్యామిలీ, పృధ్విరాజ్ గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా ప్రచారం చేశారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత, జగన్ రెడ్డి ఒక్క పృద్వీని మాత్రమే ఎస్వీబీసీ టీవీ చానల్ చైర్మన్ పదవికి నామినేట్ చేశారు. అది కూడా మూడు నాళ్ళ ముచ్చటగానే ముగిసి పోయింది. ఆయనపై ఏవో ఆరోపణలు రావడంతో ధర్టీ ఇయర్స్ ఇండస్ట్రీని పక్కన పెట్టేశారు. పృధ్విరాజు పార్టీకి దూరమయ్యారు.అటు మోహన్ బాబు కూడా అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అలీ, పోసాని మాత్రం ఇంకా పార్టీని వదల కుండా చకోర పక్షుల్లా జగన్ రెడ్డి దయకోసం, కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. జబర్దస్త్ రోజా మంత్రి పదవికోసం ఎంతగా తాపత్రయ పడ్డారో, అంతకంటే ఎక్కువగా అలీ, పోసాని నామినేటెడ్ పదవుల కోసం తాపత్రయ పడుతున్నారని అంటారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా ఆలీని ఒకటికి రెండు సార్లు ఇంటికి పిలిచి మరీ ఒట్టి చేతులతో పంపించారు. రెండు మూడు సార్లు ఆయనకు పదవులు కేటాయించినట్టు ప్రచారం సాగింది. తొలుత రాజ్యసభ, ఆ తరువాత కేబినెట్ హోదాతో సమానమైన వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవికి అలీకి కేటాయించనున్నారన్న ప్రచారం జరిగింది.అలీ దంపతులు కలిసిన సందర్భంలో మీకు గుడ్ న్యూస్ చెబుతానంటూ స్వయంగా జగన్ చెప్పడంతో పాపం అలీ అమాయకంగా ఉబ్బితబ్బిబ్బయ్యారు. అయితే గుడ్ న్యూస్ ఏదీ అలీ చెవిన పడలేదు. ఇప్పుడు మరోసారి ఆయనకు పదవి కేటాయించనున్నారన్న ప్రచారం అయితే సాగుతోంది. అలాగే పోసాని కృష్ణ మురళీ జగన్ రెడ్డిని వెనకేసుకొచ్చె క్రమంలో జనసేన పవన్ కళ్యాణ్ ఫాన్స్ ఆగ్రహానికి కూడా గురయ్యారు. ఆయనను టార్గెట్ చేస్తూ పవన్ ఫాన్స్ చాలా అసభ్యంగా ట్రోల్ చేశారు. అఫ్కోర్స్, అయన తక్కువతినలేదనుకోండి. అయినా, ఒక విధంగా జగన్ రెడ్డికి మద్దతుగా నిలిచినందుకు పోసాని సినిమా అవకాశాలు పోగొట్టుకున్నారు. అయినా నామినేటెడ్ పదవి రాలేదు. ఇంతలోనే మూడేళ్ల వైసీపీ పాలన ముగిసి పోయింది. మరో సారి అధికారంలోకి వచ్చే అవకాశాలు ఇప్పటికే పూర్తిగా అడుగంటి పోయాయి. అయినా, ఇప్పటికీ అదిగో ఇదిగో అంటున్నారే తప్ప పదవులు మాత్రం కేటాయించలేదు. అయితే ఇప్పుడు ఆలీతో పాటుగా, పోసానికి నామినేటెడ్ పదవులు ఇచ్చేసినట్లే అనుకోమంటున్నారు. అయితే ఇప్పటికే ఒకటికి రెండుసార్లు భంగపడిన అలీ మాత్రం వస్తే చూద్దాంలే .. అన్నట్లుగానే ఉన్నారని అంటున్నారు. అవును మరి, జగన్ రెడ్డి అయినా మరొకరు అయినా అందరినీ అన్ని వేళలా మోసం చేయలేరు కదా.. దట్సిట్..

# ఆర్టీసీ కష్టాలు.. తీరేనా



విజయవాడ, సెప్టెంబర్ 3, (న్యూస్ పల్స్)ఆర్టీసీ ఆదాయం ఆశాజనకంగా లేదని, 50 శాతం డీజిల్‌కు ఖర్చుకాగా, మరో 40 శాతం నిర్వహణకు సిబ్బంది జీతాలకు రూ.300 కోట్లు అవుతోందని కనుక ఇప్పట్లో కొత్త బస్సులు కొనుగోలు అసాధ్యమని ఏపీ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభు త్వంలో ఆర్టీసీ విలీనమైన తర్వాత జీతభత్యాల వెసులుబాటు ఉన్నా ఆదాయం ఆశాజనకంగా లేద న్నారు. గత నెలలో ఆర్టీసీకి వచ్చిన ఆదాయంలో ప్రభుత్వానికి 25 శాతం మేర రూ.124 కోట్లు చెల్లిం చామని తెలిపారు.జూన్‌లో పిలిచిన టెండర్ల ద్వారా 339 అద్దెబస్సులు, ఆగస్టులో పిలిచిన టెండర్ల ద్వారా మరో 156 అద్దె బస్సులు ఖరారయ్యాయని తిరుమలరావు అన్నారు. నాన్ ఏసీ స్లీపర్ బస్సులకు డిమాండ్‌ఉందని గుర్తించాం. 62 అద్దెబస్సులకు టెండర్లు పిలవగా.. ఇప్పటి వరకు 30 బస్సులు వచ్చాయి. ఈ బస్సు లకు స్టార్ రైడర్ అనే పేరును ఖరారు చేశామన్నారు. బీఓటీ విధానంలో ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా నిబంధనలను సవరించాం. గతం లో మాదిరిగా 33 ఏళ్లకు కాకుండా 15 ఏళ్ల పాటు ఆర్టీసీ ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు కొత్త పాలసీ తీసుకువచ్చామన్నారు. అలాగే, తెలంగాణకు బస్సులు పెంచేందుకు కృషిచేస్తామని, 18 రూట్లలో కొత్త బస్సులు పెంచామన్నారు. ఇతర రాష్ట్రాలకు బస్సులు పెంచే ప్రతిపాదనలున్నాయి. ప్రయాణికుల భద్రత కోసం బస్సుల్లో న్యూమాటిక్ డోర్లు ఏర్పాటు చేయనున్నాం.ఈ నెల కొత్త పీఆర్‌సీ జీతాలలో కలపలేదని, సాంకేతిక కారణాలతో ఈ సమస్య ఏర్పడిందని, ప్రాంతీయ స్థాయిలో జీతాలు చెల్లించేందుకు వీలుగా అప్‌డేషన్ చేయాల్సి ఉండ టం వల్ల ఈ నెలలో కొత్త పీఆర్‌సీ కలపటం కుదరలేదని ఎండీ తిరుమలరావు తెలిపారు.

బస్సు చార్జీల తగ్గింపు

యాణికులకు ఏపీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఏసీ బస్సు ఛార్జీల్లో 20శాతం వరకు తగ్గిస్తూ ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఛార్జీల తగ్గింపు ఈనెల 30వరకు అమల్లో ఉంటుందని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా.. రూట్లు, ఛార్జీలు ఎంత తగ్గించాలనే నిర్ణయం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌లకు అప్పగించింది. ఈనేపథ్యంలో ఛార్జీల తగ్గింపుపై ఆయా జిల్లాల ఆర్టీసీ అధికారులు ప్రకటనలు జారీ చేస్తున్నారు.విజయవాడ–హైదరాబాద్ మార్గంలో తిరిగే అమరావతి, గరుడ, వెన్నెల ఏసీ బస్సుల్లో టికెట్ ధరల్లో 10 శాతం మేర తగ్గించారు.

విజయవాడ–విశాఖ డాల్ఫిన్ క్రూజ్ , విజయవాడ–చెన్నై, విజయవాడ–బెంగళూరు వెళ్లే ఏసీ బస్సుల్లో 20 శాతం ఛార్జీలు తగ్గించారు. శుక్రవారం, ఆదివారం తప్ప మిగతా రోజుల్లో ఛార్జీల తగ్గింపు అమల్లో ఉంటుందని ఏపీఎస్‌ఆర్టీసీ సూచించింది

# రిజర్వ్ ఫర్ ఉమెన్

గుంటూరు, సెప్టెంబర్ 3,అది అనధికార రిజర్వ్‌డ్ నియోజక వర్గం. కొన్నేళ్లుగా అక్కడ ముస్లిం మైనార్టీ లీడర్లే అభ్యర్థులుగా ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్నారు. అయితే ఈ సారి ఈ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగేందుకు మహిళలు సై అంటున్నారు. ఇందుకు డిప్యూటీ మేయరే కారణమని అధికార పార్టీ కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సారి మహిళలే అక్కడ అభ్యర్దులుగా పోటీ చేయనున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొన్నేళ్లుగా..ప్రధాన రాజకీయ పార్టీలు ముస్లిం అభ్యర్థులనే బరిలోకి దించుతున్నాయి. ఎందుకంటే..ఈ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. దాదాపు అరవై ఐదు వేల మైనార్టీల ఓట్లున్నాయి. అందుకే..గత రెండు ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ముస్తఫా విజయం సాధించారు. టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా గత ఎన్నికల్లో ఓడిపోయిన నజీర్ అహ్మదే ఉన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అనేక మంది మైనార్టీ నాయకులు ఆ పార్టీలో కొనసాగుతున్నారు. ఇందులో భాగంగానే మాజీ కార్పొరేటర్ షేక్ షౌకత్ కుమార్తె షేక్ సజీలా డిప్యూటీ మేయర్గా ఎన్నికయ్యారు. గత ఏడాది నుండి ఆమె పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. షౌకత్ కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా గతంలో పిఆర్పీ నుండి పోటీ చేసి ఓడిపోయారు. ఈక్రమంలో డిప్యూటీ మేయర్‌గా ఉన్న సజీలా వచ్చే ఎన్నికల్లో టికెట్ దక్కితే ఎమ్మెల్యే గా పోటీ చేయాలన్న భావనలో ఉన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ముస్తఫా పార్టీలో చురుగ్గా ఉన్నా కూడా.. ఆయన కుటుంబ సభ్యుల జోక్యం ఎక్కువగా ఉందనే విమర్శలున్నాయి. అదే విధంగా రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవ్వటంతో ఆయనపై సహజంగానే కొంత వ్యతిరేకత ఏర్పడిందని ఓటర్ల టాక్..ఇలాంటి కారణాలు చూపిస్తూ..ఈసారి తనకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని సజీలా పార్టీ పెద్దల వద్ద చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అప్రమత్తమైన ఎమ్మెల్యే ముస్తఫా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మహిళకు ఇంకో మహిళతోనే చెక్ పెట్టాలనే ఫార్ములాతో ముస్తఫా పొలిటికల్ సీన్‌ను హీటెక్కిస్తున్నారు. ఆయన కూతురు ఫాతిమాను బరిలోకి దించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే గత నెలలో జరిగిన ప్లీనరిలో కూడా మాట్లాడేందుకు ఫాతిమాకు అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో అధికార పార్టీలో ఆధిపత్య పోరు మొదలైనట్లు కార్యకర్తలు భావిస్తున్నారు.ఈ మధ్య కాలంలో సజీలా అన్ని కార్యక్రమాల్లో పాల్గొనటంపై కూడా ఎమ్మెల్యే ముస్తఫా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. ఏమైతేనేం..ఎన్నకల టైమ్ దగ్గర పడుతోందని ఎవరికి వారు టిక్కెట్ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో, టీడీపీలో కూడా మహిళకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్స్ ఊపందుకున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇంఛార్జ్ నసీర్ అహ్మద్ పార్టీలో చురుగ్గానే వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. అయితే అధికార పార్టీ మహిళా అభ్యర్థి వైపు మొగ్గితే తమకు అవకాశం ఇవ్వాలని మాజీ తాడికొండ మండల ఎంపిపి, ప్రస్తుత తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి రిజ్వానా అడుగుతున్నట్లు ప్రచారంలో ఉంది. అధికార పార్టీ ఎత్తుకు పైఎత్తులు వేసే అవకాశం ఇవ్వాలని రిజ్వానా కోరుతున్నారట.ఇలా ప్రధాన పార్టీలు మహిళా అభ్యర్థుల పట్ల మొగ్గు చూపటం శుభపరిణామమే అంటున్నారు ఇరు పార్టీల కార్యకర్తలు. ఈ మహిళలు ఉన్నత విద్యావంతులు కావడమే కాకుండా యుక్త వయస్సులో ఉండటంకూడా నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అయితే సాంప్రదాయ నియోజకవర్గంలో మహిళలకు ఎంత మేరకు అవకాశాలు వస్తాయో తెలియాలంటే వేచి చూడాల్సిందే..

## అధికారికంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం

హైదరాబాద్హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ 17న హైదరాబాద్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. .దీంతోపాటు ఏడాదిపాటు హైదరాబాద్ విమోచన దినోత్సవాలను, నిజాం సంస్థానానికి సంబంధించిన ప్రాంతాల్లో నిర్వహించనుంది. సెప్టెంబర్ 17న హైదరాబాద్ లో జరిగే కార్యక్రమంతోపాటుగా, ఏడాదిపాటు జరిగే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరుతూ తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లేఖ ఈ మేరకు లేఖ రాసారు.

## రెండేళ్ల తర్వాత జనసమక్షంలో బ్రహ్మోత్సవాలు

తిరుమల, సెప్టెంబర్ 3, రెండేళ్ల తర్వాత శ్రీవారి భక్తుల సమక్షంలో తిరుమల వెంకన్న సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ మేరకు టిటిడి అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కరోనా కారణంగా రెండేళ్లుగా.. భక్తులు లేకుండానే వెంకన్న బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ ఏడాది కరోనా విజృంభణ తగ్గడంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను భక్తుల కళ్లెదుటే నిర్వహించేందుకు సిద్ధమైంది టిటిడి. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల పూర్తి షెడ్యూల్ ను టిటిడి ప్రకటించింది. టిటిడి షెడ్యూల్ ప్రకారం.. బ్రహ్మోత్సవాల అంకురార్పణకు ముందు ఈ నెల 20న ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు శ్రీవారి ఆలయంలో సంప్రదాయబద్ధంగా కోయిల్ అళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. 26వ తేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 27 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ 9 రోజుల పాటు స్వామివారు వివిధ వాహనసేవల్లో తిరుమాఢ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వాహనసేవలు సెప్టెంబర్ 26 బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ సెప్టెంబర్ 27 ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ సెప్టెంబర్ 28 చిన్న శేష వాహనం, స్నపన తిరుమంజనం, హంస వాహన సేవ సెప్టెంబర్ 29 సింహ వాహన సేవ, ముత్యపు పందిరి వాహన సేవ సెప్టెంబర్ 30 కల్పవృక్ష వాహన సేవ, సర్వ భూపాల వాహన సేవ అక్టోబర్ 01 మోహిని అవతారంలో స్వామి వారి దర్శనం, గరుడ వాహన సేవ అక్టోబర్ 02 హనుమంత వాహన సేవ, గజ వాహన సేవ అక్టోబర్ 03 సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ అక్టోబర్ 04 రథోత్సవం, అశ్వ వాహన సేవ అక్టోబర్ 05 చక్రస్నానం, ధ్వజావరోహణం

## కుమ్ములాటలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

రాజమండ్రి, సెప్టెంబర్ 3,ఏపీలోని రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతం రాజమండ్రి. గత ఎన్నికల్లో ఇక్కడ అర్బన్, రూరల్ సీట్లు వైసీపీ ఖాతాలో పడలేదు. వైసీపీలో బలమైన నాయకులు ఉన్నప్పటికీ .. వారి మధ్య సమన్వయం లేకపోవడంతో ఎన్నికల్లో బోల్తా కొట్టారు లోకల్ లీడర్స్. ఆ ఎన్నికల్లో చేదు ఫలితాలు వచ్చినా.. మూడేళ్లుగా రాజమండ్రి వైసీపీలో ఎలాంటి మార్పు రాలేదు. ఇప్పటికీ నేతల మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఈసారి ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలిన వైసీపీ అధిష్ఠానం ఆలోచిస్తున్నా.. స్థానిక నేతలకు చీమ కుట్టినట్టు అయినా లేదట.అప్పట్లో ఉభయ గోదావరిజిల్లాల వైసీపీ ఇంఛార్జ్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి.. రాజమండ్రిలో పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించారు. ఇప్పుడు సుబ్బారెడ్డి ప్లేస్‌లో ఎంపీ మిధున్‌రెడ్డి సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టారు. మిధున్‌రెడ్డి పలుమార్లు పార్టీ నేతలతో మాట్లాడినా.. లోకల్ లీడర్స్ ఒక పట్టాన లొంగడం లేదట. కలహాలు వీడటం లేదని సమాచారం. రాజమండ్రిలో వైసీపీపి పార్టీ ఆఫీసు లేదు. ఎంపీ మార్గాని భరత్ క్యాంప్ కార్యాలయంలోనే పార్టీ సమావేశాలు జరుగుతున్నాయి. దీనికి తోడు ఈ మూడేళ్ల కాలంలో రాజమండ్రి కోఆర్డినేటర్లుగా ముగ్గురు మారారు. ఆ ప్రయోగం కూడా సక్సెస్ కాలేదు.మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాషరావు, ంఖఎఎఅ మాజీ ఛైర్మన్ శివరామ సుబ్రమణ్యం, మరో మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ వైసీపీ కోఆర్డినేటర్లుగా పనిచేసినా.. వివిధ కారణాలు చెబుతూ తమ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ప్రస్తుతం రాజమండ్రి వైసీపీకి కోఆర్డినేటర్ లేరు. గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గానికి ఎమ్మెల్యే శ్రీదేవి ఉన్నా.. అదనంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్‌ను కన్వీనర్‌గా పెట్టారు. మరి ఒక్క ఇంఛార్జ్ కూడా లేని రాజమండ్రిలో మాత్రం.. నాయకత్వం సమస్య కొలిక్కి రావడం లేదట. రాజమండ్రిలో వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్న నేతలు ఒక వర్గంగా.. ఎన్నికల ముందు.. పార్టీ అధికారంలోకి వచ్చాక చేరిన నేతలు మరో వర్గంగా కొనసాగుతున్నారు.వైసీపీ అధిష్ఠానం చేసిన సర్వేలన్నీ రాజమండ్రిలో నెగెటివ్‌గానే వస్తున్నాయట. ఇప్పటికే మేయర్ ఎన్నికలు బకాయి ఉన్నాయి. మరో 20 నెలల్లో సాధారణ ఎన్నికలు వస్తాయి. అయినప్పటికీ స్థానికంగా నాయకత్వం సమస్య పట్టిపీడిస్తోంది. ఇక్కడ పరిస్థితి చూస్తుంటే అభ్యర్థులు కావాలని ప్రకటన చేసుకోవాల్సిన దుస్థితి ఉందని పార్టీ శ్రేణులు వాపోతున్నాయి. రాజమండ్రిలో ముఠాలను చూశాక నాయకత్వం మీద ఆశ ఉన్నవాళ్లు సైతం భయపడిపోతున్నారట. అందుకే టికెట్ ఆశిస్తున్న వారు ముందుకొచ్చి నోరు విప్పడానికి జంకుతున్నారు. సమయం వచ్చినప్పుడు చూద్దాంలే అని కొందరు.. హైకమాండ్ పిలిస్తే చూద్దామని మరికొందరు సైలెంట్‌గా ఉండిపోతున్నారట. ఎమ్మెల్యేతోపాటు మేయర్ అభ్యర్థి ఎవరో తేల్చుకోలేకపోతున్నాయి శ్రేణులు. మరి.. వైసీపీ పెద్దలు రాజమండ్రి వైసీపీకి ఎలాంటి చికిత్స చేస్తారో చూడాలి.

## యాప్ పై భగ్గుమంటున్న టీచర్లు

నెల్లూరు, సెప్టెంబర్ 3, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వానికి ఉపాధ్యాయులకు మధ్య నిప్పు మరింత రాజుకుంది. పాఠశాల విద్యాశాఖలో నుంచి ఫేస్ రికగ్నైజేషన్ హాజరు అమలు చేయాలని ప్రభుత్వం భీష్మించింది. కానీ అందుకు ఉపాధ్యాయులు ఏమాత్రం అంగీకరించే ప్రసక్తే లేదని కరాఖండీగా చెప్పేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని తెగేసి చెబుతు న్నారు. ప్రభుత్వ మే అందుకు సంబంధిం చిన పరికరాలు విద్యాశాఖకు ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయంపై ఆగస్టు 18న తొలిదశ చర్చలు ఫలించలేదు. ప్రభుత్వం తొలుత 15 రోజులు ఈ–హాజ రుపై శిక్షణ ఇస్తామని ప్రకటించి.. నేటి నుంచి మార్గదర్శకాలు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా పాఠశాలల వద్ద హాజరు పరికరాలను ప్రభుత్వవే ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా హాజరు వేసే విధానాన్ని విద్యా వ్యవస్థలో ముందుగా ప్రవేశపెట్టిన విషయం విదితమే. ప్రభుత్వ టీచర్లకు హాజరును ఈ యాప్ ద్వారా తీసుకుంటున్నారు. అయితే, ఈ యాప్ విషయమై ఉపాధ్యా యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఫేస్ రికగ్నిషన్ యాప్ ఇప్పుడు పోలీసులకు వరంగా మారింది. ఏయే ఉపాధ్యాయులు ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తున్నారు.? ఎవరెవరు ఎక్కడి నుంచి విజయవాడకు వచ్చేందుకు ప్రయ త్నిస్తున్నారు వంటివన్నీ ప్రభుత్వానికి ఈ యాప్ ద్వారా తెలుస్తాయ్.పోలీసులు ఆ యాప్‌ని వినియోగించి ఉపాధ్యాయుల్ని ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు వీలు కలుగుతుంది. ప్రభుత్వాలు తీసు కునే నిర్ణయాలు, వ్యక్తిగత స్వేచ్ఛకు ఎలా భంగం కలిగిస్తాయో చెప్పడానికి ఇదే నిదర్శనమంటూ ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నేతలూ ఆరోపిస్తున్నారు.

# పొత్తులపై రెండు పార్టీల్లో మీమాంస

గుంటూరు, సెప్టెంబర్ 3, అన్నీ అనుకున్నట్లే జరిగితే, అతి త్వరలోనే, టీడీపీ, బీజేపీల మధ్య మళ్ళీ పొత్తు పొడిచే అవకాశాలున్నాయనే సంకేతాలు రోజు రోజుకు మరింతగా స్పష్టమవుతున్నాయి. బీజేపీ ఏపీ రాష్ట్ర నాయకులు, అప్పే అలాంటిదేమీ లేదని బుకాయిస్తున్నా, కేంద్ర నాయకత్వం మాత్రం టీడీపీతో పొత్తు విషయంపై సీరియస్ గానే ఆలోచిస్తోంది. ఇంకా స్పష్టంగా పొత్తు వైపే మొగ్గు చూపుతోందని, ఢిల్లీ మీడియా వర్గాల్లో చాలా బలంగా వినిపిస్తోంది. మరో వంక, వరస పెట్టి మిత్ర పక్షాలు అన్నీ, ఎన్డీఏని వదిలి పోవడంతో పాత మిత్రులతో కొత్త పొత్తులకు సంబంధించి పునరాలోచించక తప్పని పరిస్థితి బీజేపీకి ఏర్పడింది, ముఖ్యంగా నితీష్ కుమార్ గుడ్ బై చెప్పిన తర్వాత పార్టీ వ్యూహకర్తలు ఆ దిశగా ఆలోచనలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏపీలో బీజేపీకి ఉన్నది లేదు,పోయేది లేదు. టీడీపీతో పొత్తు వలన వచ్చే అసెంబ్లీలో ఓ నాలుగు, లోక్ సభలో ఒకటో రెండో సీట్లు వస్తే వస్తాయి. వచ్చే విషయం పక్కన పెడితే, పోయేది అయితే అసలే లేదు. అయితే, పొరుగు రాష్ట్రం తెలంగాణలో బీజేపీ బలమైన శక్తిగా ఎదగడమే కాకుండా, ఇంకొక్క మెట్టెక్కితే,సునాయాసంగా అధికారంలోకి రాగలమని,బీజేపీ జాతీయ నాయకత్వంతో పాటుగా, తెలంగాణ బీజేపీలోనూ గట్టి విశ్వాసం ఏర్పడింది. ఇదే విషయంపై బీజేపీ సీనియర్ నాయకుడు ఒకరు, బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంలో బాగా ప్రచారం అయిన స్లోగన్ 'జోర్ ఏక్ ధక్కా, మారో ని గుర్తు చేస్తూ ఇంకొక్క దెబ్బ పడితే తెరాస ప్రభుత్వాన్ని పడగొట్టగలమని బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం గట్టిగా నమ్ముతోందని అన్నారు. మరో వంక,తెలంగాణ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావు, జాతీయ రాజకీయాలపై కన్నేసి, కమల దళానికి సవాలు విసురుతున్నారు. నిజానికి ఇప్పటికిప్పుడు, కేసీఆర్ జాతీయ స్థాయిలో బీజేపీకి సవాలు కాకపోవచ్చును, కానీ, లోక్ సభ ఎన్నికలకు ముందు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తెరాస ముచ్చటగా మూడవసారి విజయం సాధించి, అయన ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ సొంతం చేసుకుంటే మాత్రం ఆయన ప్రభావం జాతీయ రాజకీయాల పై, ఉంటుందని బీజేపీ వ్యూహ కర్తలు లెక్కలు వేస్తున్నారు. సో.. కేసీఆర్ జాతీయ ఆశలను మొగ్గలోనే తుంచేయాలంటే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెరాసని ఓడించడం కమల దళానికి అవసరమని, ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదలా ఉంటే, తెలంగాణలో తెలుగు దేశం పార్టీ పూర్వ వైభవం కోల్పోయినా, ప్రజల్లో ముఖ్యంగా బీసీల్లో ఆ పార్టీకి ఇంకా పట్టుంది. రాష్ట్ర విభజనకు నేపధ్యంగా జరిగిన 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ 15 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంది. అయితే 2018 ఎన్నికలలో కాంగ్రెస్, కోదండ రామ్ పార్టీలతో కలిసి ప్రజా ఫ్రంట్'గా ఏర్పడి పోటీ చేసినా, పెద్దగా ఫలితం దక్కలేదు. కేవలం మూడు శాతం ఓట్లు, రెండు సీట్లు మాత్రమే దక్కాయి. ఆ ఇద్దరు కూడా కారెక్కడంతో తెలంగాణ అసెంబ్లీలో టీడీపీకి ప్రాతినిథ్యం లేకుండా పోయింది. మరో వంక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ సహా అనేక మంది నాయకులూ తెరాస, బీజేపే, కాంగ్రెస్ పార్టీలలో చేరిపోయారు. ప్రస్తుత తెరాస మంత్రివర్గంలో అరడజను మందికి పైగా మాజీ టీడీపీ నేతలే ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క సహా చాలా మంది కాంగ్రెస్ నాయకులు మాజీ టీడీపీ నేతలే.. ఇందులో రేవంత్ రెడ్డి సహా చాలా మంది చంద్రబాబును గౌరవించే.. అభిమానించే వారే ఉన్నారు. తెలంగాణలో ఇంచుమించుగా 32 అసెంబ్లీ నియోజక వర్గాల్లో , ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలో ఆంధ్రా సెటిటర్స్ గెలుపు ఓటములను నిర్ధారించే నిర్ణాయక శక్తిగా ఉన్నారు. సహజంగా సెట్లెర్స్ పై టీడీపీ ప్రభావం ఉంటుందని. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లో బీసీలు ఇప్పటికీ టీడీపీ వైపు మొగ్గుచుపుతున్నారని, బీజేపీ సీనియర్ నేతలు భావిస్తున్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో కీలక పదవులు అందుకున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ వంటి కొందరు బీసీ నేతలు టీడీపీతో పొత్తు తెలంగాణలో బీజేపీకి కలిసొస్తుందని విశ్లేషిస్తున్నారు. అందుకే బీజేపీ జాతీయ నాయకులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో తెలుగుదేశంతో పొత్తును కోరుకుంటున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలంగాణ బీజేపీలోని ఒక వర్గం మాత్రం టీడీపీతో పొత్తును గట్టిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీతో పొత్తు పెట్టుకుంటే, గత ఎన్నికలలో కేసీఆర్, చంద్రబాబు భుజం మీద సెంటిమెంట్ తుపాకి పెట్టి కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసిన విధంగా రేపటి ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీస్తారని ఈ వర్గం వాదిస్తోంది. అయితే, ఉభయ వర్గాలు కూడా అంతిమ నిర్ణయాన్ని కేంద్ర నాయకత్వానికి వదిలేసినట్లు చెపుతున్నారు. అలాగే, బీజేపీ జాతీయ నాయకత్వం అంత త్వరగా నిర్ణయం తీసుకోదని, టీడీపీతో పొత్తును బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ ప్రయోజనాల కోణంలోనే చూస్తుందని అంటున్నారు. తెలంగాణలో బీజేపీకి మేలు జరుగుతుందంటే, ఏపీలో పార్టీ లాభనష్టాలను పక్కన పెట్టి, ఉభయ తెలుగు రాష్ట్రాలలో టీడీపీతో పొత్తుకు టిక్కు పెడుతుందని అంటున్నారు. అదలా ఉంటే, టీడీపీ, బీజేపీ పొత్తు వలన ఏపీలో టీడీపీకి ఏ మేరకు మేలు జరుగుతుందనే విషయంలో, ఇటు పార్టీలో, అటు రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ లో బీజేపీకి గత ఎన్నికల్లో నిండా ఒక శాతం ఓటు కూడా రాలేదు. ఇప్పుడైనా, రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంది అనేందుకు ఎక్కడా దాఖాలాలు లేవు. తిరుపతి లోక సభ, ఆత్మకూరు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో, టీడీపీ పోటీలో లేకున్నా, బీజేపీ అభ్యర్ధులకు డిపాజిట్ దక్కలేదు. అయినా, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడం, అలాగే, ఓ ఐదారు శాతం వరకు ఓటు షేర్ ఉంటుందని భావిస్తున్న జనసేన ఇప్పటికే బీజేపీతో పొత్తులో ఉండడం వలన చేత, టీడీపీ, నాయకత్వం బీజేపీతో పొత్తుకు సిద్ధమైందని అంటున్నారు. ఈ రెండు కారణాల చేతనే, తెలుగు దేశం పార్టీ ఏపీలో బీజేపీతో పొత్తును కోరుకుంటోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అదే సమయంలో, బీజేపీతో పొత్తు వలన టీడీపీకి నష్టం జరిగే ప్రమాదం లేక పోలేదని కూడా విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గడచిన ఎనిమిది సంవత్సరాలలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, విభజన హమీలతో సహా, రాష్ట్రానికి మేలు చేసే ఏ ఒక్క మంచి పని చేసింది లేదని, సామాన్య ప్రజలకు కూడా అర్థమై పోయింది. అలాగే, గడచిన మూడు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వికృత మానస పుత్రిక మూడు రాజధానుల ప్రతిపాదన సహా, జగన్ రెడ్డి అరాచక పాలనకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తోందనే అభిప్రాయమే ఆందరిలోనూ వుంది. నిజానికి, 2019 కంటే ఇప్పుడే బీజేపీ పట్ల జనంలో వ్యతిరేకత ఎక్కువగా ఉందని అంటున్నారు.అప్పుడు ఇస్తామన్న ప్రత్యేక హోదా ఇవ్వక పోవడం ఇతరత్రా చేయవలసిన సహాయం చేయక పోవడం వలన, కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పట్ల వ్యక్తమైన ప్రజాగ్రహానికి,ఇప్పుడు జగన్ రెడ్డి అరాచక పాలను కేంద్ర ప్రభుతం గుడ్డిగా సంర్దిస్తోందనే ఆగ్రహం తోడైంది.ఒక విధంగా ఏపీ ప్రజల్లో బీజేపీ పట్ల డబుల్ ఇంజిన్ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సో, టీడీపీ, బీజేపీ పొత్తును సమాన్య ప్రజలు ఎంతవరకు ఆమోదిస్తారు అనే విషయంలో అనుమానాలున్నాయని అంటున్నారు. ఈ అన్నిటినీ మించి గత 2019 ఎన్నికల్లో బీజేపీ ఓటర్లు, టీడీపీ ఓటమే లక్ష్యంగా, సొంత పార్టీ అభ్యర్ధులు ఉన్నా, వైసీపీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని మరిచి పోరాదని అంటున్నారు. ఇప్పుడు కూడా పార్టీ జాతీయ నాయకత్వం బలవంతంగా టీడీపీతో పొత్తుకు ఒప్పించినా, బీజేపీ ఓటు, అది ఎంతైనా కానీ, టీడీపీకి పూర్తిగా ట్రాన్స్ఫర్ అవుతుందనే నమ్మకం లేదని కొందరు రాజకీయ విశ్లేషకులు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.జగన్ రెడ్డి ప్రభుత్వం పట్ల రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాగ్రహం, పార్టీలో చోటు చేసుకుంటున్న అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో, ప్రజలు టీడీపీవైపు చంద్రబాబు వైపే చూస్తున్నారు. ఈ పరిస్థితిలో బీజేపీతో పొత్తు అవసరమా? అనర్థమా? అనే విషయంలో తెలుగు దేశం పార్టీ ఒకటికి రెండు సార్లు ఆలోచించు కోవలసిన అవసరం ఉందని అంటున్నారు. నౌ ది బాల్ ఈజ్ ఇన్ టీడీపీ కోర్ట్ ... నిర్ణయం తీసుకోవలసింది, టీడీపీనే కానీ, రాష్ట్రంలో 'జీరో' పార్టీ బీజేపీ కాదని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

# డీఎల్... డీలా..

కడప, సెప్టెంబర్ 3, డీఎల్ రవీంద్రారెడ్డి కడప జిల్లాలో సీనియర్ నేత. ఆయన రాజకీయాల్లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి పెద్దగా క్రియాశీలకంగా లేరు. అయితే 2019 ఎన్నికలకు ముందు డీఎల్ రవీంద్రారెడ్డి వైసీపీకి మద్దతు పలికారు. ఆ పార్టీలో చేరినట్లే అనుకోవాలి. అయితే వైసీపీలో చేరినా ఆ పార్టీ అధినాయకత్వం గుర్తించలేదు. కడప జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న తనను పట్టించుకోకుండా బద్వేల్ కు చెందిన డీసీ గోవింద్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవిని రెన్యువల్ చేశారు. ప్రొద్దుటూరు చెందిన రమేష్ యాదవ్ కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఇక రాజ్యసభ పదవి కూడా దక్కలేదు. మూడేళ్లు ఓపిక పట్టిన డీఎల్ రవీంద్రారెడ్డి ఎనిమిది నెలల క్రితం వైసీపీ ప్రభుత్వం అసంతృప్తిని వెళ్లగక్కారు. జగన్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మూడేళ్లలో ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందన్నారు. బాబాయి వివేకా హత్య కేసులో అసలు నిందితులు ఎవరో జగన్ కు తెలుసునని కూడా వ్యాఖ్యానించారు. ప్రజలు జగన్ ప్రభుత్వంపై అసంతృప్తితో రగలి పోతున్నారని వచ్చే ఎన్నికలలో జగన్ కు ఓటమి తప్పదని కూడా ఆయన జోస్యం చెప్పారు. ఇది జరిగి ఎనిమిది నెలలు పైగానే అవుతుంది. అప్పటి నుంచి మళ్లీ ఆయన సైలెంట్ అయ్యారు. డీఎల్ రవీంద్రారెడ్డి టీడీపీలో చేరబోతున్నారని, చంద్రబాబు వద్దకు తన దూతలను కూడా పంపారని వార్తలు వచ్చాయి. అయితే తెలుగుదేశం పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాలేదని మైదుకూరులో ప్రచారం జరుగుతోంది. మైదుకూరు నియోజకవర్గంలో పుట్టా సుధాకర్ యాదవ్ ఉన్నారు. బీసీ కోటా కింద ఆయనకు టిక్కెట్ మరోసారి ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు కూడా హామీ ఇచ్చారట. నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా కూడా ఉన్నారు. దీంతో మైదుకూరు టిక్కెట్ డీఎల్ రవీంద్రారెడ్డికి వచ్చే ఎన్నికల్లో అవకాశాలు లేవు. అయితే బీజేపీలో చేరతారని కూడా కొంత కాలం ప్రచారం జరిగింది. బీజేపీలో చేరితే జనసేన మద్దతుతో మైదుకూరులో విజయం సాధించే అవకాశాలున్నాయని అంచనా వేశారు. అయితే బీజేపీ, టీడీపీ, జనసేన కలుస్తాయని ప్రచారం జరుగుతుండటంతో డీఎల్ రవీంద్రారెడ్డి వెనక్కు తగ్గినట్లే కనిపిస్తున్నారు. . ఇప్పుడు డీఎల్ రవీంద్రారెడ్డి పరిస్థితి రాజకీయంగా ఎటు కాకుండా పోయింది. వైసీపీ నుంచి బయటకు వచ్చారు. టీడీపీలో చేరేందుకు అడ్డంకులున్నాయి. పోనీ టీడీపీకి మద్దతిస్తే ఏదైనా నామినేటెడ్ పదవి దక్కుతుంది అంటే అదీ నమ్మకం లేదు. బీజేపీ, జనసేనలో చేరినా ఫలితం లేదు. దీంతో ఆయన 2024 ఎన్నికల్లో పోటీ చేయడానికి ఏ పార్టీ నుంచి అవకాశాలు కన్పించడం లేదు. అందుకే డీఎల్ కొన్ని నెలల నుంచి మౌనంగా ఉన్నారు. ఆయన అనుచరులు కూడా వత్తిడి తెచ్చినా పెద్దగా స్పందన లేదని తెలిసింది. వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడిన డీఎల్ ప్రస్తుతం సైలెంట్ గా ఉండటానికి గల కారణాలపై కడప జిల్లాలో చర్చోప చర్చలు జరుగుతున్నాయి.

# ఏపీలో 5 వేల సభలకు బీజేపీ ప్లాన్

విజయవాడ, సెప్టెంబర్ 3, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ దూకుడు చూపిస్తోంది.. ఇప్పటికే వరుసగా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుంది.. బీజేపీని పరుగులు పెట్టిస్తామని కమలనాధులు గత కొన్ని రోజులుగా ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పుడు దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్దం చేసుకుంటున్నారు.. ఏపీలో వైసీపీ–టీడీపీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలన్న లక్ష్యంతో స్కెచ్ సిద్ధం చేసుకుంటున్న బీజేపీ.. ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ కార్యక్రమాలను శ్రీకారం చుట్టాలని డిసైడ్ అయ్యింది.. దీంట్లో భాగంగా.. జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై ఓ భారీ క్యాంపెయినింగ్ ప్రొగ్రామును ప్లాన్ చేసింది బీజేపీ. ఈ నెల 18వ తేదీ నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ పేరుతో భారీ సంఖ్యలో అంటే మొత్తంగా 5 వేల సభలను నిర్వహించుకునేందుకు రంగం సిద్దం చేసుకుంటోంది. ఓ విధంగా చెప్పాలంటే గల్లీ మీటింగ్స్ తరహాలో కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రణాళికను సిద్ధం చేసుకుంది బీజేపీ.ఈ విధంగా చేయడం ద్వారా సభలకు జనసమీకరణకు పని లేకపోవడంతోపాటు.. ప్రజల వద్దకే వెళ్లి రోడ్‌షోలు నిర్వహించినట్టుగా ఎక్కడికక్కడ స్థానిక నేతలు స్ట్రీట్ కార్నర్ సమావేశాలు పెడితే కేంద్ర ప్రభుత్వ విధానాలను.. బీజేపీని ప్రజలకు మరింత చేరువ చేయొచ్చనేది బీజేపీ వ్యూహంగా కన్పిస్తోంది. ఈ మీటింగ్సులో కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులెన్ని.. వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటుంది అనే విషయాలను లెక్కలతో సహా వివరించేందుకు రంగం సిద్దం చేసుకుంటోంది బీజేపీ. ఇదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఏయే సంక్షేమ పథకాలకు కేంద్రం నిధులు ఇస్తోందనే అంశాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు స్ట్రీట్ మీటింగ్స్‌ను వేదికగా చేసుకోనున్నారు ఏపీ కమలనాధులు.ఈ స్ట్రీట్ మీటింగ్సుకు ప్రాధాన్యత తెచ్చేందుకు.. వీలైనన్ని సభల్లో ఏపీ బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి చెందిన నేతలు పాల్గొనేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇదే సందర్భంలో కేంద్ర నాయకత్వం నుంచి కొందరు కీలక నేతలను.. అలాగే కేంద్ర మంత్రులను కూడా ఈ స్ట్రీట్ మీటింగ్సులో పాల్గొనేలా షెడ్యూల్ ఫిక్స్ చేసుకోవాల్సిందిగా ఏపీ నేతలు కోరినట్టు సమాచారం. మొత్తంగా.. ఏపీలో కమలనాధులు దూకుడు చూపిస్తున్నారు.

# అతడో సామాజిక సారధి..నిత్య నూతన వారధి

## -నేడు ప్రపంచ పేపర్ బోయ్స్ దినోత్సవం



నగరం నిద్రపోతున్న వేళ... తొలి కోడి కూతకు ముందే అతడు మేల్కొంటాడు.రవి కిరణాలు ప్రసరించక మునుపే.. ఎముకలు కొరికే చలిలోనూ ప్రపంచాన్ని గుప్పిట పట్టి ఆ సంగతులన్నింటినీ ఇంటింటికీ చేరవేస్తాడు. తానెవరో కూడా కన్పించక... ఇలా వచ్చి, అలా వెళ్లిపోతాడు. పేరుకు మాత్రమే అతడు పేపర్ బాయ్...కానీ, అతడో సామాజిక సారథి.. వార్తా పత్రికలను పాఠకులకు చేర్చే నిత్య నూతన వారధి. అతనికి కూడా ఒక రోజు వుందోచ్.. ఈరోజు ప్రపంచ పేపర్ బోయ్స్ దినోత్సవం. తొలి పేపర్ బాయ్‌గా గుర్తింపు పొందిన బార్నీ ఫ్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. మొట్టమొదటి పేపర్ బాయ్ అమెరికాకు చెందిన బార్నీ ఫ్లాహెర్టీ. ఆ రోజుల్లో పేపర్ వెయ్యాలంటే అక్కడి ప్రజలు నామోషీగా భావించేవారు. బార్నీ మాత్రం డిగ్నిటీ ఆఫ్ లేబర్ అన్నట్టు తన పరిస్థితికి తగ్గట్టు తాను పేపర్ బాయ్‌గా చేస్తే తనకు ఖర్చులకు డబ్బులు వస్తాయని అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా పేపర్ బాయ్ గా చేరిపోయాడు. 1833 నాటికి అతడి వయస్సు 10 సంవత్సరాలు. ఆయన అప్పట్లో న్యూయార్క్ సన్ పేపర్ వేసేవాడు. తెల్లవారకముందే దిన పత్రిక ఇంటికి చేరవేస్తుండడంతో ఇతర పేపర్ల వినియోగదారులు సైతం బార్నీ వేసే న్యూయార్క్ సన్ పేపర్‌నే కోరుకున్నారు. దీంతో అనతికాలంలోనే ఆ పత్రిక చందాదారులు రెట్టింపయ్యారు. బార్నీ అనంతరం మరికొందరు పేపర్ బాయ్‌గా చేరినా వారందరికీ అతడే ఆదర్శంగా నిలిచారు. బార్నీ సేవలు గుర్తించిన పత్రికా యాజమాన్యం అతడికి మరిన్ని బాధ్యతలు అప్పగించింది. పేపర్ బాయ్‌గా చాలా మంది పాఠకుల హృదయాల్లో స్థానం సంపాదించిన బార్నీ పుట్టినరోజు (సెప్టెంబర్ 4)ను ఆయా పత్రికా సంఘాల నాయకులు పేపర్ బాయ్స్ డే గా ప్రకటించారు. నాటి నుంచి ప్రపంచంలోని అన్ని పత్రికల యాజమాన్యాలు బార్నీ పుట్టిన రోజున పేపర్ బాయ్స్‌డేగా ఫాలో అవుతున్నాయి. ఇదిలా ఉండగా అమెరికాలోని హ్యూస్టన్‌లో టెక్సాస్ ప్రెస్ అసోసియేషన్ 125 వార్షికోత్సవం సందర్భంగా బార్నీ గౌరవార్థం అతడి కాంస్య విగ్రహాన్ని 2005లో ఏర్పాటు చేసింది. కత్తిమీద సాములాంటిదే పేపర్‌బాయ్ పని అంటే.. ఏదో పేపర్లు తీసుకొని ఉదయం ఇళ్ల వద్ద వేసి వెళ్లిపోతారని అనుకుంటారు అంతా. అయితే ఇందులో ఉన్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఎందరో పాత్రికేయులు రేయింబవళ్లు శ్రమించి సేకరించిన వార్తలను సబ్‌ఎడిటర్లు సరిచేసి ముద్రణ ఆమోదయోగ్యంగా మలుస్తారు. ఆ తర్వాత ముద్రించబడ్డ దిన పత్రికలను పాఠకులకు చేరవేయాల్సిన బాధ్యత పేపర్‌బాయ్‌లదే. తెల్లవారు జామున 3.30 గంటలకు ముందే పేపర్‌బాయ్‌లు నిద్రలేచి సైకిల్‌పై బయలుదేరి పేపర్ కట్టలు వచ్చే పాయింట్లకు చేరుకుంటారు. దినపత్రికలను సర్దుకున్నాక పై అంతస్థులో ఉన్న ఇళ్లకు పేపర్‌ను ఎగర వేసేందుకు తాడుతోనూ, పేపర్‌నే పొట్లంగా మలిచి ఆ కట్టలను సైకిల్‌పై సర్దుకుని బయలు దేరుతారు. తమ ఖాతాదారులకు పత్రికలు వేసుకుంటూ ముందుకు సాగిపోతారు. పేపర్ వేసే క్రమంలో సైకిల్ లేదా ద్విచక్ర వాహనం మరమత్తులకు గురవడం, ఆరోగ్యం బాగలేక నిద్రలేవడం ఆలస్యమైతే ఇక తిట్ల దండకాలే. బిల్లులు సకాలంలో వసూలు చేయకపోతే ఏజెంట్లు జీతాలు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేయడం ఇలా చాలా బాధలే ఉన్నాయి.... ఎందరో మహనీయులు: భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్‌బాయ్‌గా పని చేశారు. తన విద్యార్థి దశలో పుస్తకాల ఖర్చుల కోసం తెల్లవారుజామునే లేచి ఇంటింటా పేపరు వేసేవారు. ఇక ప్రఖ్యాత జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ కూడా పేపర్‌బాయ్‌గా పని చేశారు. స్వాతంత్రోద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న రోజుల్లో బాలగంగాధర్ తిలక్ సైతం పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్‌బాయ్‌గా పనిచేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మహనీయులు, మహోను బావులు పేపర్‌బాయ్‌లుగా పనిచేసిన వారే.

# హామీలన్నీ పూర్తి చేస్తాం

విశాఖపట్నం సాధారణ ఎన్నికలలోపే మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో నే బిల్లు పెట్టొచ్చని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా ఒంటరిగానే పోటీ చేస్తుందన్న ఆయన...మళ్లీ అధికారం తమదేనని అన్నారు. వైకాపా ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఎక్కడా చెప్పలేదని, అయినా 90 శాతానికి పైగా పూర్తి చేశామని, ఇంకా సమయం ఉన్నందున మిగిలిన వాటినీ అమలు చేస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నిక లకు ముందే మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చిం చే అవకాశం ఉందన్నారు. ప్రతిష్ఠాత్మక మైన బల్క్‌డ్రగ్స్ పార్క్ రాష్ట్రానికి వస్తుంటే తెదేపా నేత యనమల అది వద్దంటూ కేంద్రానికి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఫార్మా రంగానికి రాష్ట్రం హబ్గా మారబో తోందని, ఏ పరిశ్రమ వచ్చినా స్వాగతి స్తామని చెప్పారు. అమరరాజా సంస్థపై వచ్చిన ఫిర్యాదులపై పీసీబీ విచారణ జరిపి నిర్ధారిస్తే తెదేపా నేతలు ఎందు కు మాట్లాడలేదని మంత్రి ప్రశ్నించారు. తెదేపా నేతలు చంద్రబాబు, యనమల రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, వారిని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టాలన్నా రు. విభజన హామీలను కేంద్రానికి తాకట్టుపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.రాష్ట్రానికి అప్పు లు ఇవ్వొద్దంటూ ఆర్బీఐకి తెదేపా నేతలు లేఖలు రాశారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడే చంద్రబాబును, ఆయన కుమారుడు లోకేశును జైలుకు పంపాలని పేర్కొన్నారు. వరద ప్రాంతాల పర్యటన సమయంలో సీఎంతో ముచ్చటించిన బాలిక మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తంచేశారు. విలీన ప్రాంతాలకు అదనపు వైద్య బృందాలను పంపుతామని మంత్రి చెప్పారు.

# పేలుడులో దంపతులకు గాయాలు

హైదరాబాద్ సికింద్రాబాద్ రాంగోపాల్ పేట్ లో పేలుడు కలకలం రేపింది. స్థానికంగా వున్న ఒక అపార్ట్మెంట్లో మొదటి అంతస్తులో భారీ పేలుడు సంభవించింది. పేలుడు దాటికి ఇల్లు ధ్వంసం అయింది.. ఘటనలో భార్యాభర్తలిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు... మొదటగా సిలిండర్ బ్లాస్ట్ అయినట్లుగా పోలీసులు భావించినప్పటికీ సిలిండర్ నుండి ఎటువంటి బ్లాస్ట్ కాలేదని నిర్ధారించారు. పేలుడు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# మంథని లో పూర్తిస్థాయిలో అమలు కానీ టీచర్ల బయోమెట్రిక్ హాజరు

మంథని పెద్దపెల్లి జిల్లా మంథని మండలంలో ప్రభుత్వ పరంగా ప్రాథమిక,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలు అన్ని కలిపి 58 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో దాదాపు 200మందికి పైగా టీచర్లు పని చేస్తూ ఉండగా గత కరోనా సీజన్ నుండి రెండున్నర ఏండ్లుగా బయోమెట్రిక్ యంత్రాలు మూలకు పడేసి హాజరు నమోదు ప్రక్రియ పెండింగులో ఉండగా తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో సెప్టెంబర్1 నుండి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారు. మంథని మండలంలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా తడిసిన బయోమెట్రిక్ యంత్రాల స్థానంలో ఓ ఐదారు పాఠశాలలకు ఇంతవరకు బయోమెట్రిక్ యంత్రాలు రాకపోగా,మరికొన్ని చోట్ల గత సంవత్సరం మూసివేసి మరల ఈ విద్యా సంవత్సరం లో ప్రారంభం అయిన కొన్ని పాఠశాలకు కూడా యంత్రాలు పంపిణీ చేయకుండా,ఇంకా కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలు కారణంగా మంథని మండలంలో పూర్తిస్థాయిలో బయోమెట్రిక్ హాజరు నమోదు ప్రక్రియ కొనసాగడం లేదు. ఇప్పటికే మంథని మండలంతో పాటు నాలుగు మండలాలకు ఇంచార్జి ఎం.ఈ.ఓ గా ఉన్న మంథని మండల విద్యాశాఖాధికారి మంథని మండలంపై ప్రత్యేక శ్రద్ధతో, విధుల పట్ల నిబద్ధతతో ఈ మధ్య ఉదయం9 గంటలకే టీచర్ల హాజరు పై పలు పాఠశాలలను తనిఖీ చేస్తుండగా బయోమెట్రిక్ హాజరు నమోదు ప్రక్రియ కూడా సజావుగా సాగేటట్టు చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా హక్కుల కోసం కొట్లాడే పలు సంఘాలు కూడా భాధ్యత కోసం కూడా కృషి చేసి అందరూ సమయపాలన పాటించేట్టు చూసి, విద్యార్థి లోకానికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

# ఎమ్మిగనూరు లో ఘనంగా గణేష్ నిమజ్జనం

## భారీగా తరలివచ్చిన జనం

ఎమ్మిగనూరు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో వినాయక నిమజ్జనం అంగరంగ వైభవంగా సాగింది. పట్టణంలో కొలువైన 174 విగ్రహాలను స్థానిక ఎల్.ఎల్.సి కెనాల్ లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్నారుల కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నిమజ్జన శోభాయాత్ర చూడడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. సోమప్ప కూడలి, శివ కూడలిలో కాల్చిన ప్రత్యేక బాణసంచా ప్రజలను మంత్రముగ్దులను చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇద్దరు డిఎస్పీ లు, ఐదుగురు సీఐ లు పదిమంది ఎస్ఐ లు, 200 పైగా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కడప విమానాశ్రయంలో సియం వైఎస్ జగన్ కు ఘన వీడ్కోలు

కడప మూడు రోజుల జిల్లా పర్యటనను ముగించుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి శనివారం ఉదయం కడప విమానాశ్రయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం ఉదయం ఇడుపులపా యలో దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి సియం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలలో కూడా పాల్గొని, శుక్రవారం రాత్రి బస చేసి శనివారం ఉదయం ఆయన.. హెలికాప్టర్ ద్వారా ఉదయం 09.20 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుండి ప్రత్యేక విమానంలో 09.33 గంటలకు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, యం.పి. వైఎస్ అవినాష్ రెడ్డి, నగర మేయర్ కె. సురేష్ బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్యే లు పి.రవీంద్రనాథ్ రెడ్డి,రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి, రఘురామి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,సుధీర్ రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు అంబటి కృష్ణారెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎమ్. సాయి కాంత్ వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనాలు ముఖ్యమంత్రికి ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వీడ్కోలు పలికిన వారిలో.. కడప అదనపు ఎస్పీ పూజిత, డిఎస్పీ శివా రెడ్డి, అగ్రికల్చర్ అడ్వైసరి బోర్డ్ చైర్మన్ సంబటూరి ప్రసాద్ రెడ్డి, జెడ్పీటిసి నరేన్ రామాంజనేయులు రెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి,ఏరో డ్రమ్ సెక్యూరిటి ఆఫీసర్ బి.శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి యువ నాయకులు ఉమెర్, తదితరులు ఉన్నారు

# మాజీ ఎమ్మార్వో సుజాత మృతి

హైదరాబాద్ హైదరాబాద్ లోని షేక్ పేట్ మాజీ తహసీల్దార్ సుజాత అనుమానస్పదస్థితిలో మరణించారు. ఆమెది ఆత్మహత్య అని, గుండెపోటులో మరణం అని సోషల్ మీడియాలో వార్తలోచ్చాయి. పోలీసులు కుడా నిర్ధారించలేదు. గత యేడాది ఆదాయానికి మించి ఆస్తుల కేసులో గతంలో సుజాత అరెస్ట్ అయ్యారు. అంతకు మందు బంజారాహిల్స్ లో ఒక భూవివాదంలో ఆమె లంచం తీసుకున్నట్టు ఆరోపణలతో ఏసీబీ ఆరెస్టు చేసింది. సుజాత జైలులో వున్నప్పుడే భర్త అజయ్ ఆత్మహత్య చేసుకున్నారు. అయన సంవత్సరం ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. అజయ్ బిల్డింగ్ పైనుండి దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందారు. ప్రస్తుతం సుజాత బెయిల్ పై బయట వున్నారు. సుజాత మృతదేహం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# నగరాన్ని నందనవనం చేస్తాం: మేయర్



**నగరంలో రూ.2.71 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు మేయర్ వెల్లడి**
**హాజరైన ఎమ్మెల్యే హాఫిజ్, ఎం.పి. సంజీవ్ కుమార్**



కర్నూలు శనివారంకర్నూలు నగరాన్ని నందనవనం చేస్తామని నగర మేయర్ బి.వై. రామయ్య అన్నారు. శనివారం 4 వార్డులలో రూ.2.71 కోట్లకు సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ తో పాటు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, ఎం.పి. సంజీవ్ కుమార్ లు శంకుస్థాపనలు చేశారు. 2వ వార్డులో రూ.117.29 లక్షలతో కింగ్ మార్కెట్ అభివృద్ధికి, హజీర కాలేజ్ వద్ద సిసి డ్రైన్ నిర్మాణానికి, 1వ వార్డులో రూ.10.00 లక్షలతో రాఘవేంద్ర స్వామి ఆలయం నందు సిసి డ్రైన్ నిర్మాణానికి, 52వ వార్డులో రూ.84.00 లక్షలతో మున్సిఫ్ కోర్ట్, పాత సాయిబాబా ఆలయం, సెంట్రల్ లైబ్రరీ సమీపంలో సిసి డ్రైన్ నిర్మాణానికి, 48వ వార్డులో రూ.60.00 లక్షలతో రైల్వే అండర్ బ్రిడ్జి దగ్గర స్టోమ్ వాటర్ డ్రైన్, రోజా స్ట్రీట్ నందు సిసి డ్రైన్ నిర్మాణానికి మేయర్, ఎమ్మెల్యే, ఎం.పి.లు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో రూ.2.71 కోట్లకు సంబంధించిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుండగా అందులో రూ.2.01 కోట్లకు సంబంధించిన అభివృద్ధి పనులు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వార్డులోనే ఉన్నాయన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కుల, మత, ప్రాంత భేధాల్లేని పాలన అందిస్తుందనే దానికి ఇదే నిలువెత్తు నిదర్శనం అన్నారు. రానున్న ఎన్నికలలోపు నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయలన్నదే తమ అభిమతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు షాషావలి, మల్లికా బేగం, లతీఫ్, విజయ ప్రత్యూష, సోంపల్లి కృష్ణకాంత్, అర్షియా ఫర్హీన్, రాజేశ్వర్ రెడ్డి, అహ్మద్, కో ఆప్షన్ మెంబర్ నయీం పాషా, కృష్ణమూర్తి, ఎస్.ఈ. శేషసాయి, ఎం.ఈ. షాకీర్, డి.ఈ.ఈ. నరేష్, ఏ.ఈ.లు హిమబిందు, రసూల్, రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని సూచించిన తహసీల్దార్.



గుత్తి సెప్టెంబర్ 03 గుత్తి మండలంతోపాటు మున్సిపల్ పరిధిలో గల ప్రభుత్వ భూములను,ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,మండల ప్రజలకు స్థానిక గుత్తి తహసిల్దార్ మహబూబ్ బాషా స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,పట్టణ మండల ప్రజలకు హెచ్చరించారు. అలాగే ఎక్కడైతే ప్రభుత్వ భూముల్లో అక్కడ ప్రభుత్వపరంగా బోర్డు నాటించి ప్రభుత్వానికి తెలియజేస్తామని, ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు

# బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి ఏ కుమార్ మృతి

బద్వేలు బద్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి ఏ కుమార్ శనివారం ఉదయం కోర్టు ప్రాంగణంలోని మృతి చెందారు. ఆయన వయసు 88 సంవత్సరాలు. సీనియర్ న్యాయవాదిగా కడప జిల్లాలో ఆయన ప్రసిద్ధి చెందారు. దాదాపు 60 సంవత్సరాలుగా ఆయన న్యాయవాద వృత్తిలో ఉన్నారు. శనివారం బద్వేల్ లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభించారు. హైకోర్టు జడ్జి బట్టు దేవానంద్ జిల్లా జడ్జి సాల్మన్ రాజ్ జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయాధిపతులు బార్ సంఘం రాష్ట్ర సభ్యుడు వీఎస్ రెడ్డి పలువురు ప్రముఖులు ప్రారంభోత్సవానికి రావడం జరిగింది. సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ప్రారంభానికి డి ఏ కుమార్ కూడా హాజరయ్యారు. కోర్టును హైకోర్టు జడ్జి ప్రారంభించిన తర్వాత కొద్దిసేపటికి డి ఎ కుమార్ కోర్టు ప్రాంగణంలోని కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కుమారు మృతిచెందడంతో

**కోర్టు ప్రాంగణంలోనే ప్రాణాలు వదిలిన కుమార్**
**నివాళులు అర్పించిన హైకోర్టు జడ్జి జిల్లా జడ్జి బద్వేల్**
**ఆర్డిఓ పలువురు న్యాయాధిపతులు**

కోర్టులోని న్యాయవాదులు ప్రారంభోత్సవానికి వచ్చిన జడ్జిలు ఇతర అధికారులు ఒక్కసారిగా షాక్ తిన్నారు. సీనియర్ న్యాయవాది కుమార్ వద్ద ఎంతోమంది శిక్షణ పొంది ఇప్పుడు న్యాయవాదులుగా రాణిస్తున్నారు. కుమార్ భౌతికకాయాన్ని ఆయన గృహానికి తరలించారు. హైకోర్టు జడ్జి, జిల్లా జడ్జి, బద్వేలు ఆర్డిఓ ఆకుల వెంకటరమణ జిల్లాలోని పలువురు న్యాయాధిపతులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు

# తిరుపతి స్మార్ట్ సిటి అభివృద్ధి పనులుపై సమావేశం

**- ఎండి అనుపమ అంజలి**



తిరుపతిసెప్టెంబర్ 3తిరుపతి స్మార్ట్ సిటి పనులను వేగవంతం చేసి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంట్టున్నట్లు తిరుపతి స్మార్ట్ సిటి బోర్డ్ సమావేశంలో తిరుపతి స్మార్ట్ సిటి ఎం.డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి స్మార్ట్ సిటీ బోర్డ్ సభ్యులకు వివరించారు. తిరుపతి స్మార్ట్ సిటీ బోర్డు సమావేశం శనివారం తిరుపతి నగరపాలక సంస్థ వీసి హాల్లో జరిగింది. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, టిటిడి జేఈఓ సధా భార్గవి, అమరావతి నుండి ఇంజనీర్ ఇన్ ఛీఫ్ ఆనందరావు, తుడా వీసి హరికృష్ణ, ప్రొఫెసర్ రమశ్రీలు వర్చువల్ పద్దతిలో పాల్గొనగా, తిరుపతి స్మార్ట్ సిటి ఎండి అనుపమ అంజలి, న్యూఢిల్లీ నుండి విచ్చేసిన స్మార్ట్ సిటి అండర్ సెక్రటరీ విజయకుమార్, జనరల్ మేనేజర్ చంద్రమౌళి, బోర్డ్ సభ్యులు డా.రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఈఈ చంద్రశేఖర్ పాల్గొని 2021-22 ఆర్ధిక సంవత్సరం యొక్క ఆర్ధిక ఖతాలను ఆమోదించడం జరిగింది. సమావేశం అనంతరం స్మార్ట్ సిటి ఎం.డి అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రాజెక్టులపైన, ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టుల పని తీరుపై బోర్డు సభ్యులకు వివరించడం జరిగిందన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ నూతన భవనంతో కలిపి సిటీ ఆపరేషన్ సిస్టమ్ బిల్డింగ్ నిర్మాణానికి వర్క్ ఆర్డర్ పై కమిటి ఆమోదం తెలపడం జరిగిందని, తిరుపతి రైల్వే పార్శిల్ ఆఫీసు ఎదురుగా నిర్మించబోయే మల్టి లెవల్ కార్ పార్కింగ్ కోసం పెరిగిన అంచనా వ్యయంపై చర్చించి ఆమోదించడం జరిగిందన్నారు. ఇప్పటికే పూర్తి కావొస్తున్న దశలోని శ్రీనివాససేతు, వినాయకసాగర్, గొల్లవానిగుంట క్రికెట్ స్టేడియం పనులను మరింత వేగవంతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. దేశంలోనే తిరుపతి స్మార్ట్ సిటికి ఒక గొప్ప ప్రత్యేకతను తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, సి.ఎఫ్.ఓ మల్లిఖార్జున్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సూర్య ఈసారి గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడా?



సూర్య విభిన్నమైన సినిమాలకు కెరాఫ్ అడ్రస్ గా నిలిచిన విషయం తెలిసిందే. కొత్త తరహా సినిమాలు చేస్తూనే కమర్షియల్ మాస్ మసాలా సినిమాలతో హీరోగా తనకంటూ తెలుగు తమిళ భాషల్లో ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్నారు. ఒక దశలో వరుస విజయాల్ని సొంతం చేసుకున్న సూర్య 'సింగం 3' తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని సొంతం చేసుకున్నాడు. ఈ దశలో ఏ సినిమా చేసినా ఫ్లాపులే పలకరించడంతో సూర్య ఇక కష్టమేనా అనే కామెంట్ లు వినిపించాయి. అయితే అదే సమయంలో అనూహ్యంగా 'ఆకాశం నీ హద్దురా' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకుని మళ్లీ ట్రాక్ లోకి వచ్చాడు. కరోనా తరువాత సెకండ్ వేవ్ టైమ్ లో ఓటీటీలో నేరుగా విడుదలైన ఈ మూవీ కోసం హీరో సూర్య ఓ యుద్ధమే చేశాడని చెప్పాలి. థియేటర్లలో రిలీజ్ చేయకపోవడం.. ఓటీటీఓ రిలీజ్ చేయడంతో ఎగ్జిబిటర్లు సూర్య సినిమాలని థియేటర్లలో రిలీజ్ చేయకుండా బ్యాన్ చేస్తామంటూ హెచ్చరించాయి. తానే నిర్మాతగా భారీ బడ్జెట్ తో ఎన్నో వ్యవప్రయాసల కోర్చి నిర్మించిన సినిమా కావడంతో సూర్య ఇలాంటి బెదిరింపులకు తలొగ్గలేదు. ముందు అనుకున్నట్టుగానే ఎవరెన్ని రకాలుగా బెదిరించినా లెక్కచేయకుండా 'ఆకాశమే నీ హద్దురా' మూవీని డైరెక్ట్ గా అమెజాన్ ప్రైమ్ లో విడుదల చేసి సంచలనం సృష్టించాడు. ఓటీటీలో విడుదలైన ఈ మూవీ సంచలన విజయాన్ని సాధించిన సూర్య నమ్మకాన్ని నిజం చేసింది. ఈ మూవీ ఇచ్చిన స్ఫూర్తితో హీరో సూర్య తరువాత చేసిన 'జై భీమ్' ని కూడా ఓటీటీలో విడుదల చేయడం అది కూడా బ్లాక్ బస్టర్ అనిపించుకోవడంతో సూర్య ఫ్యాన్స్ హ్యాపీగా ఫీలయ్యారు. అయితే పాండిరాజ్ డైరెక్షన్ లో చేసిన యాక్షన్ థ్రిల్లర్ 'ఎంతార్కుమ్ తున్నిదవన్' భారీ అంచనాలతో విడుదలై డిజాస్టర్ అనిపించుకుని సూర్యకు వరుస హిట్ ల తరువాత ఊహించని షాకిచ్చింది. ప్రస్తుతం బాల తో 'అచలుడు' మూవీ చేస్తున్నాడు. ఈ మూవీపై సూర్యతో పాటు ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నా అందరి దృష్టి మాత్రం వెట్రిమారన్ తో సూర్య చేయబోతున్న 'వాడివాసల్'పైనే వుంది. కారణం వెట్రిమారన్ చేసిన 'అసురన్' ఉత్తమ తమిళ చిత్రంగా 2019లో జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం విజయ్ సేతుపతితో 'విడుదలై' మూవీని చేస్తున్నాడు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఈ మూవీ పూర్తి కావస్తున్న నేపథ్యంలో సూర్యతో చేయనున్న 'వాడివాసల్'ని డిసెంబర్ నుంచి పట్టాలెక్కించడానికి రెడీ అవుతున్నాడు. వీ క్రియేషన్స్ బ్యానర్ పై ఈ మూవీని కలైపులి ఎస్ థాను నిర్మించబోతున్నారు. జల్లికట్టు నేపథ్యంలో సాగే ఈ మూవీలో సూర్య ద్విపాత్రాభినయం చేయబోతున్నాడట. ఓ పాత్ర పేరు 'పిచ్చి' అని మరో పాత్ర పేరు అంబులి అని తెలుస్తోంది. 1960లో వచ్చిన ఓ పీరియాడిక్ నవల ఆధారంగా ఈ మూవీని తెరకెక్కించబోతున్నారు. నివధికంగా ఈ మూవీ కోసం భారీ షెడ్యూల్ ని ప్లాన్ చేశారట. ఈ మూవీ కోసం ఇప్పటికే జల్లికట్టులో సూర్య ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ కూడా ఎండింగ్ స్టేజ్ కి రావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్ వైపు మళ్లింది. దీంతో అంతా సూర్య ఈసారి గట్టిగానే ప్లాన్ చేస్తున్నాడా? అని కామెంట్ లు చేస్తున్నారు.

# మల్టీప్లెక్స్ లో సినిమా టికెట్ 75 రూపాయలే త్వరపడండి!

సినిమా టికెట్లను ఇష్టానుసారంగా పెంచుకోవచ్చని ప్రభుత్వాలు ఎప్పుడైతే ఆదేశాలు ఇచ్చాయో అప్పుడే జనాలు థియేటర్ కు రావడం మానేశారు. నెల తర్వాత ఓటీటీలోకి వస్తుంది కదా అని ముఖం చాటేస్తున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ సినిమాలను మాత్రమే థియేటర్లో చూస్తున్నారు. ఏమాత్రం తేడా కొట్టినా థియేటర్ కు రావడం లేదు. ఒక కుటుంబం మల్టీప్లెక్స్ లో సినిమా చూడాలంటే ఎంత లేదన్నా రూ.2వేలు ఖర్చు అవుతోంది. అంత భరించడం ఎందుకని



జనాలే రావడం లేదు. అయితే ఇప్పుడు మల్టీప్లెక్స్ లో 75 రూపాయలకే సినిమా చూసే అవకాశాన్ని థియేటర్ యజమానులు కల్పిస్తున్నారు. 150 రూపాయలకు పైగా ఉన్న టికెట్ ను సగం రేట్ కు ఇవ్వడం ఏంటని ఆశ్చర్యపోతున్నా ఇదీ నిజం. కాకపోతే ఇది కేవలం ఒక్కరోజు మాత్రమే. సెప్టెంబర్ 16న దేశంలో 'నేషనల్ సినిమా డే'గా పాటిస్తున్నారు. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని థియేటర్లు మల్టీప్లెక్స్ ల సంఘాలన్నీ కలిసి ఈ సినిమా డే సందర్భంగా ఈ ఆఫర్ ప్రకటించాయి. ఆ రోజు మల్టీప్లెక్స్ సింగిల్ థియేటర్లలో కేవలం రూ.75కే సినిమాను చూడొచ్చు. ఇది రాబోయే బ్రహ్మాస్త్ర సినిమాకు గొప్ప వరంగ కానుంది. 16కు ముందు విడుదలయ్యే తెలుగు సినిమాలకు లక్కీ ఛాన్స్ గా మారింది. దీనివల్ల పేదలు మధ్యతరగతి వారు కూడా మల్టీపెక్స్ లో సినిమా చూసే అవకాశం దక్కుతుంది. ఇలా వారికోసమైనా నెలలో ఒకరోజు ఇలాంటి ప్రయత్నం చేస్తే సినిమాను అందరికీ చూపించినట్లు అవుతుంది. ఇలా థియేటర్ల సామాజికసేవ కూడా పూర్తవుతుంది. ఈ దిశగా థియేటర్ యజమానులు మల్టీప్లెక్స్ లు కనుక నిర్ణయిస్తే సినీ పరిశ్రమ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లడం ఖాయం. అయితే ఈ రూ.75 టికెట్ కేవలం థియేటర్లలో కొన్నవారికే.. ఆన్ లైన్ లో అయితే జీఎస్టీ మన్ను మషాణం అని టికెట్ రేటు పెరుగుతుంది. ఇక టికెటింగ్ వెబ్సైట్లు ఈ ఆఫర్ ను ఇస్తాయా? లేదా? అన్నది డౌటు. సో థియేటర్ కు వచ్చి కొంటేనే మీకు రూ.75 పడుతుందన్నమాట..


# కెప్టెన్లుగా ఇర్ఫాన్ పఠాన్, హర్భజన్ సింగ్



సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభం కానున్న లెజెండ్స్ లీగ్ క్రికెట్ రెండో ఎడిషన్‌కు సంబంధించి కెప్టెన్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. ఈ సీజన్‌లో పాల్గొనబోయే నాలుగు జట్లు తమ సారథుల పేర్లను ప్రకటించాయి. తొలుత ఇండియా క్యాపిటల్స్ (గౌతమ్ గంభీర్) జట్టు, ఆతర్వాత గుజరాత్ జెయింట్స్ (వీరేంద్ర సెహ్వాగ్) జట్టు తమ కెప్టెన్ల పేర్లను ప్రకటించగా.. తాజాగా మణిపాల్ టైగర్స్, బిల్వారా కింగ్స్ ఫ్రాంచైజీలు తమ సారథుల పేర్లు వెల్లడించాయి. మణిపాల్ గ్రూప్ యాజమాన్యం చేజిక్కించుకున్న మణిపాల్ టైగర్స్.. టీమిండియా మాజీ స్పిన్నర్, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ హర్భజన్ సింగ్‌ను తమ కెప్టెన్‌గా ఎంపిక చేసుకున్నట్లు ప్రకటించగా, ఎల్ఎన్‌జే బిల్వారా గ్రూప్ ఆధ్వర్యంలోని బిల్వారా కింగ్స్ టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్‌ను తమ నాయకుడిగా ఖరారు చేసుకున్నట్లు వెల్లడించింది. తమను సారథులుగా ఎంపిక చేయడం పట్ల భజ్జీ, ఇర్ఫాన్‌లు ఆనందం వ్యక్తం చేశారు. తమ ఎంపికకు 100 శాతం న్యాయం చేసేందుకు సర్వశక్తులా ప్రయత్నిస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారిరువురు తమతమ యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, లీగ్‌కు సంబంధించి ఆటగాళ్ల ఎంపిక జరగాల్సి ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో ఈ తంతు కూడా పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈనెల 16 నుంచి ప్రారంభం కాబోయే ఎల్ఎల్‌సీ సీజన్-2 ఐదు వేదికలపై (కోల్‌కతా, లక్నో, న్యూఢిల్లీ, కటక్, జోధ్‌పూర్) 22 రోజుల పాటు (అక్టోబర్ 8 వరకు) సాగనుంది. లీగ్‌లో భాగంగా మొత్తం 16 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాల్లో (భారత్‌కు స్వాతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న సంబురాలు) భాగంగా టోర్నీ ఇనాగురల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ ఇండియా మహారాజాస్, వరల్డ్ జెయింట్స్ జట్ల మధ్య జరుగనుంది. ఇండియా మహారాజాస్‌కు బీసీసీఐ బాస్ గంగూలీ సారథ్యం వహించనుండగా.. వరల్డ్ జెయింట్స్ జట్టుకు ఇయాన్ మోర్గాన్ నేతృత్వం వహించనున్నాడు.

# మెగా హీరో దూకుడు మామూలుగా లేదుగా!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తొలిసారి కలిసి నటించిన పాన్ ఇండియా మల్టీస్టారర్ మూవీ 'ఆర్ఆర్ఆర్'. రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ మూవీ వరల్డ్ వైడ్ గా విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టిన ఈ మూవీతో ఎన్టీఆర్ రామ్ చరణ్ పాన్ ఇండియా స్టార్స్ గా మారిపోయారు. 1920 ప్రీ ఇండిపెండెంట్ ఎరా నేపథ్యంలో ఇద్దరు లెజెండరీ ఫ్రీడమ్ ఫైటర్స్ అల్లూరి సీతారామరాజు కొమురం భీం ల ఫిక్షనల్ స్టోరీగా తెరకెక్కించారు. మే 20న ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్స్ జీ5 నెట్ ఫ్లిక్స్ లలో



స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ అక్కడ కూడా పలు రికార్డుల్ని తిరగరాస్తూ హాలీవుడ్ మేకర్స్ తో పాటు స్టార్స్ ని విశేషంగా ఆకట్టుకుంటోంది. నెట్ ఫ్లిక్స్ లో పదిహేను వారాలుగా టాప్ లో నిలుస్తూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇదిలా వుంటే ఇంతటి పాపులారిటీని సొంతం చేసుకున్న ఈ మూవీలో నటించిన హీరోలు రామ్ చరణ్ ఎన్టీఆర్ కూడా వరల్డ్ వైడ్ గా ఫేమస్ అయ్యారు. అయితే ఆ క్రేజ్ ని ఉపయోగించుకోవడం లేదనే కామెంట్ లు ఇటీవల వినిపించిన విషయం తెలిసిందే. 'పుష్ప'తో పాన్ ఇండియా వైడ్ గా క్రేజ్ ని దక్కించుకున్న బన్నీ ఆ క్రేజ్ తో వరుస బ్రాండ్ లకు బ్రాండ్ అంబాసిడర్ గా సైన్ లు చేస్తూ వరుస కమర్షియల్ యాడ్ లలో నటిస్తూ జోరు చూపిస్తున్నారు. అయితే చరణ్ ఎన్టీఆర్ మాత్రం 'ఆర్ఆర్ఆర్' క్రేజ్ ని ఆ స్థాయిలో క్యాష్ చేసుకోలేకపోతున్నారని ఫ్యాన్స్ తో పాటు పలువురు కామెంట్ లు చేశారు. అయితే ఈ విషయంలో ఎన్టీఆర్ కొంత వెనకబడి వుంటే రామ్ చరణ్ మాత్రం దూకుడు పెంచేశాడు. ఇటీవల హీరో కంపనీకి చెందిన గ్లామర్ బైక్ కి ప్రచార కర్తగా సైన్ చేసిన చరణ్ దీనికి సంబంధించిన కమర్షియల్ యాడ్ షూట్ ని మెరుపు వేగంతో పూర్తి చేసేశాడట. 30 సెకన్ల పాటు సాగే ఈ యాడ్ ని అడ్వెంచరస్ గా షూట్ చేసినట్టుగా తెలిసింది. ఇదిలా వుంటే తాజాగా చరణ్ మరో బ్రాండ్ కు ప్రచార కర్తగా సైన్ చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని తెలిసింది. అయితే ఇది ఏ కమర్షియల్ బ్రాండ్ అన్నది మాత్రం ఇంకా బయటికి రాదు. అంతే కాకుండా ఇప్పటి వరకు హీరో గ్లామర్ యాడ్ తో పాటు మరో రెండు బ్రాండ్ లని కూడా చరణ్ ఓకే చేశారట. మరిన్ని లైన్ లో వున్నాయని చెబుతున్నారు. చరణ్ ని చూస్తుంటే మునుపటికి మించి కమర్షియల్ యాడ్స్ విషయంలో దూకుడు పెంచినట్టుగా కనిపిస్తోందని చెబుతున్నారు. చరణ్ ప్రస్తుతం శంకర్ అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్న మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. శంకర్ 'ఇండియన్ 2' షూటింగ్ లో బిజీగా వుండటంతో చరణ్ కు మంచి టైమ్ లభించింది. ఆ టైమ్ ని కమర్షియల్ బ్రాండ్ ల కోసం చరణ్ వాడుకుంటుండటం విశేషం.

# చరిత్ర సృష్టించిన మిచెల్ స్టార్క్.. ప్రపంచంలోనే తొలి బౌలర్‌గా..!

ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అంతర్జాతీయ వన్డేల్లో అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన బౌలర్‌గా స్టార్క్ నిలిచాడు. శనివారం జింబాబ్వేతో జరిగిన మూడో వన్డేలో రియాన్ బర్ల్ వికెట్ పడగొట్టిన స్టార్క్.. తన వన్డే కెరీర్‌లో 200 వికెట్ల మైలు రాయిని అందుకున్నాడు. తద్వారా ఈ అరుదైన ఘనతను స్టార్క్ తన పేరిట లిఖించుకున్నాడు. కాగా అంతకుముందు ఈ రికార్డు పాకిస్తాన్ మాజీ బౌలర్ సక్లైన్ ముస్తాక్ (104 మ్యాచ్‌లు) పేరిట ఉండేది. తాజాగా స్టార్క్ కేవలం 102 మ్యాచ్‌ల్లోనే 200 వికెట్లు పడగొట్టి ముస్తాక్ రికార్డును బ్రేక్ చేశాడు. ఈ ఘనత సాధించిన జాబితాలో టాప్‌లో స్టార్క్ ఉండగా.. రెండు మూడు స్థానాల్లో వరుసగా సక్లైన్ ముస్తాక్ (104 మ్యాచ్‌లు), ఆసీస్ దిగ్గజం బ్రెట్‌లీ(112 మ్యాచ్‌లు) ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**